# లిఫ్ట్

భూపాల్

అన్వేష్ మంచివాడే. అతని స్కూటరూ మంచిదే. ఎప్పుడూ కండిషన్‌లో ఉంచుకుంటాడు. తను ఒక్కడే వెళుతుంటే ఎప్పుడు ఎవ్వరు ఎక్కడ లిఫ్ట్ అడిగినా ఎంతో ఆదరణ, అభిమానంతో స్కూటర్ ఆపి సహాయం చేస్తాడు. తను వెళ్ళే మార్గంలో ఆ లిఫ్ట్ అడిగిన వ్యక్తి ఎక్కడ దించేయమన్నా దించేస్తాడు. "తోటి మనిషికి ఆమాత్రం సహాయం చేయడంలో తప్పేముంది? మనకు ఖర్చా, ఆ మాత్రం సమయం వృధా చేయడం ఇబ్బందా? ఎవరి ఆపద ఎలా వుంటుందో చెప్పలేంగా?" అంటాడు. ఎప్పుడు చూసినా అతని వెనకాల ఎవరో ఒకరు ఉండేవుంటారు స్కూటర్ రైడింగ్‌లో. నేనూ, అతనూ ఆఫీస్‌కి వెళ్ళేదారీ, తిరిగొచ్చే దారీ ఒకటే. ఈ మధ్య నెల రోజులుగా చూస్తున్నాను. అతన్ని ఎవ్వరూ లిఫ్ట్ కోసం ఆపే ప్రయత్నం చేసినా ఆపడం లేదు. ఎప్పుడూ ఎవ్వరూ వెనకాల కూర్చొని కనిపించడం లేదు. ఎందుకో అర్థం కాక అడిగాను.

"నెల క్రితం చార్మినార్ క్రాస్‌రోడ్ దగ్గర ఎవరో లిఫ్ట్ అడిగారు. ఆ వ్యక్తి సచివాలయం వరకొస్తానన్నాడు. సరేనని కూర్చోబెట్టుకొని బయలుదేరాను. నేరుగా లోయర్ టాంక్‌బండ్ మలుపు వరకెళ్ళే సరికి రెండు బండ్ల మీద అంటే ఒక స్కూటర్, ఒక హీరోహోండా మీద నలుగురు వ్యక్తులు వచ్చి నన్ను ఆపారు. ఎప్పుడూ చూడని వీళ్ళు నన్నెందుకు ఆపుతున్నారా? అనే అనుమానంతో వెనకాల కూర్చున్న అతనికోసం కాబోలని ఆపాను. అతను "ఆపొద్దు పదా..." అని అప్పటికే అన్నాడు. ఒకడు నా దగ్గరకొచ్చి "మొన్న జరిగిన అల్లరిలో వీడితోబాటు నీవు కూడా వచ్చావు గదరా?" అంటూ నన్నూ రెండు వాయించారు. నేను కాదనీ, క్రాస్ రోడ్డు నుండి కేవలం వీడికి లిఫ్ట్ ఇస్తున్నాననీ చెప్పి నా ఐడెంటిటీ కార్డు చూపించి భయంతో బతిమాలుకుంటే వదిలేశారు. అప్పటికీ నాల్గు దెబ్బలు నాకు తప్పలేదు. వచ్చిన రెండు బండ్లూ, ఆ నలుగురూ వెంటనే వెళ్ళిపోయారు. నోట్లో నుండి కారుతున్న రక్తంతో నా ప్యాసింజర్ మెల్లగా కుంటుతూ వచ్చినదారే వెనక్కు నడుస్తూ వెళ్ళిపొయ్యాడు. కనీసం సారీ కూడా చెప్పలేదు. నేను నా బండి స్టార్ట్ చేసుకొని బతుకు జీవుడా అని ఆఫీసు కెళ్ళాను. అదిగో ఆ అనుభవంతో ఇక నేనెవ్వరికి లిఫ్ట్ ఇవ్వడం లేదు. అదిరా జరిగిందీ" అన్నాడు అన్వేష్.



"నిజమే ఇది చేదు అనుభవమే. అయితే అందరూ అలాంటి వ్యక్తులే వుండరుగా! ఇప్పటివరకు నీవు కనీసం వెయ్యిమందికి సహాయం చేసి వుంటావు ఎన్నో ఏండ్ల నుండి. అది అనుకోని సంఘటన ఇప్పుడే జరిగింది. మళ్ళీ అదే, జరుగుతుందని తలచడం తప్పుగదా! యాదృచ్ఛికంగా జరిగిందేదీ మళ్ళీ పునరావృత్తం అవుతుందనుకోవడం పొరపాటు" అన్నాను.

"నువ్వెన్ని చెప్పు. సమాజం కుళ్ళిపోతోంది. నీతి, నియమం పూర్తిగా నశించి పోతున్నాయి. నేను చేసిన నేరమే లేదు. అయినా దెబ్బలు పడ్డాను. అందుకే నాకు లిఫ్ట్ ఇవ్వాలంటే ఇష్టం లేదు. తెలిసిన వాళ్ళయితేనే ఆపుతున్నాను. ఎప్పుడన్నా" అన్నాడు.

ఇంకా నేనేం చెప్పాలో అర్థం కాక మౌనం వహించాను.

## 'క్షణం' అంటే ఎంతకాలం?

భారతీయుల కాలప్రమాణంలో రెప్పపాటే అత్యల్ప కాలమని చెప్పాలి. అంటే 'సెకండు'లో 67.5 వ వంతు.



18 రెప్పపాటుల సమయం - ఒక కాష్ఠ

30 కాష్ఠలు - ఒక కల

30 కలలు - ఒక క్షణం (నాలుగు నిమిషాలు)

6 క్షణాలు - ఒక గడియ (24 నిమిషాలు)

2 గడియలు - ఒక ముహూర్తం (48 నిమిషాలు)

30 ముహూర్తాలు - ఒక అహోరాత్రం (ఒక పగలు, ఒక రాత్రి కలిసిన దినం)

గడియనే 'ఘడియ' అని, 'ఘటిక' అని కూడ పిలుస్తారు. శాస్త్ర ప్రకారం భారతీయుల కాలమాన ప్రమాణాలివి.

## 'మన్వంతరం' అంటే?

| | | |
|---|---|---|
| కృతయుగం | - | 17,28,000 సంవత్సరాలు |
| త్రేతాయుగం | - | 12,96,000 సంవత్సరాలు |
| ద్వాపరయుగం | - | 8,64,000 సంవత్సరాలు |
| కలియుగం | - | 4,32,000 సంవత్సరాలు |

ఈ నాలుగు యుగాలను కలిపి 'మహాయుగం' అంటారు. 71 మహాయుగాల కాలాన్ని ఒక 'మన్వంతరం' అంటారు. 100 'మహాయుగాల'ను 'కల్పం' అంటారు.

'కల్పం' బ్రహ్మకు ఒక 'దినం'. భారతీయుల కాలగణనను అనుసరించి ప్రస్తుతం మనం 'శ్వేతవరాహ' కల్పంలో, వైవస్వత మన్వంతరంలో ఉన్నాం.

మనువులు పద్నాలుగురు. 1. స్వాయంభువ, 2. స్వారోచిష, 3. ఉత్తమ, 4. తాపస, 5. రైవత, 6. చాక్షుష, 7. వైవస్వత, 8. సూర్య సావర్ణిక, 9. దక్షిసావర్ణిక, 10. బ్రహ్మసావర్ణిక, 11. రుద్ర సావర్ణిక, 12. ధర్మ సావర్ణిక, 13. రౌచ్య, 14. భౌచ్య మనువులు.

- దైవం వెంకట సత్యనారాయణ